# దాంపత్యం

-కట్టుకోలు సుబ్బారెడ్డి

"ఇదిగో...ఏమోయ్ తాయారూ! ఏం చేస్తున్నావు? ఖాళీగా లేకపోయినాసరే ఒకసారి ఇలా రావాలి మరి"

"ఖాళీగానే ఉన్నప్పటికిన్నీ నేను రానండి. మీతో చచ్చిపోతున్నా. రాలేకా పోలేకాన్నూ! ఏడాదా? రెండేళ్లా? కాస్త అటూ ఇటుగా చెప్పాలంటే ముప్పై నలభైయేళ్లుగా మీ చాకిరే సరిపోతోంది."

"అదేమిటే? మన పెళ్లయ్యే ఇంకా ముప్పయ్యేళ్లు కాలేదని జ్ఞాపకం. అలాంటిది నువ్వేమో ముప్పయి కూడా కూడా కాదు ఏకంగా నలభైయ్యేళ్లబట్టీ రాలేకపోలేకా చస్తున్నానంటున్నావు? అయినా పెళ్లి మేళం వాయించే దగ్గర మాట్లాడుకునేవారిలాగా ఎందుకే ఇలా అరిచి అరిచి మాట్లాడుకోవడం? ఒకసారిలా రారాదూ"

"ఆ..వచ్చాను. ఇప్పుడు చెప్పండి. బాగా జ్ఞాపకమున్నవారిలాగా పెద్ద ఫోజు పెడుతున్నారే? నేను ఐదారు తరగతులు చదివేటప్పటి నుంచీ నా చదువుకన్నా ముందు మీ కంచి గరుడ సేవే సరిపోయేది. పండుగ సెలవలప్పుడూ, వేసవి సెలవలప్పుడూ మా ఇంటి దగ్గర తిష్టవేసి 'తాయారూ అది పత్రావే, తాయారూ ఇది పత్రావే' అంటూ నన్ను గుంజీళ్లు తీయించలేదేమిటి? అందునా తాయారు కూడా కాదు, తయారు అని పిలిచి నన్నేడిపించేవారు కాదేమిటీ? మీకు తోడుగా మా బామ్మొకటి. మన బావే కదే అలివేలూ అని మీ పక్షాన పలికి మీ సేవలు చేయించలేదూ. వీటన్నిటినీ కలిపి లెక్కవేస్తే అబ్బో... ముప్పయ్యేళ్లేం ఖర్మ బ్రిటీష్ వారి పాలనలాగా రెండు మూడు వందలేళ్లవుతాయి"

"అవునే. అమ్మమ్మ వుందని సెలవులకొచ్చే వాడ్ని. నువ్వు తప్ప సెలవుల్లో అమ్మమ్మగారింటికి వెళ్లనివారెవరో చెప్పు చూద్దాం. అయినా మీ వంశపువాళ్లు లెక్కల్లో రామానుజానికి గురువులన్న సంగతి నాకు జ్ఞాపకంలేక అలా అన్నానులే. అయినా టెన్త్‌క్లాసులో అందునా లెక్కల్లో డింకీ కొట్టిన ఆ శుంఠకు నువ్వు అక్కవు కదూ. ఆ సంగతి నాకు జ్ఞాపకం లేదనుకోకు"

"అబ్బో... మీరూ మీ అమోఘమైన జ్ఞాపకశక్తిని, అమ్మ పుట్టిల్లు గూర్చి మేనమామ దగ్గర చెప్పినట్లు మీ సంగతి నాకు తెలియదనుకోకండి. కార్యానికి ముహూర్తం పెట్టి శుభలేఖ పంపిస్తే అవ్వ... రెండురోజులు ముందుగానే దయచేసారు, అదీ మీ జ్ఞాపకశక్తి. మా తమ్ముడికి లెక్కల పరీక్ష రోజున జ్వరమొచ్చిన సంగతి మీకు గుర్తుందనుకోవడం అత్యాశే. మీరలా రెండురోజుల ముందుగానే వచ్చారని నా స్నేహితురాళ్లంతా నన్నెంత ఆటలు పట్టించి ఎగతాళి చేసారో మీకేం తెలుసు. ఆ ప్రభావతయితే ఇప్పటికి కూడా 'తొందరపడి ఒక కోయిల ముందే కూసింది' అని పాటలు పాడుతుంది తెలుసా?"

"ఆ రోజున ముహూర్తపు ఉత్తరం రాసిన చవట తొమ్మిదన్న అంకెను కలగలిపేసి ఏడు అనుకునేటట్లు రాసాడని ఇప్పటికే వెయ్యిసార్లు చెప్పాను"

"మీరు రెండురోజులు ముందుగానే రాదలచిగానీ మీ మతిమరుపుతో ఏదో తారీకునే ముహూర్తమనుకునిగానీ ముందే వచ్చి తొమ్మిదిని ఏడని పొరబడినట్లుగా నాటకమాడి మమ్మల్ని నమ్మించడానికి పాట్లు పడుతున్నారని నేను వెయ్యొన్నొకటోసారి చెబుతున్నాను, పునరుద్ఘాటిస్తున్నాను, నొక్కి వక్కాణిస్తున్నాను"

"సరె...సరె...వక్కాణించావు. అసలు నేను పిలిచిన కారణమేమంటే? ఆ... అది కాదు తాయారూ ఏం చేస్తున్నావోనని పిలిచాను లేవోయ్. అంత కోపమెందుకు?"

"ఏం చేస్తున్నానా? నేను చస్తే వెంటనే ఏమేమి కావాలో లిస్టు రాస్తున్నా. మీకేం మగమహారాజులు. ఒకటికి నాలుగుసార్లు ఆ జగదేకవీరుని కథ సినిమా చూసి అన్నీ కంఠతాపడతారు. ఇక ఒసే, ఏమే, ఏమిటే, ఏమోయ్, తాయారూ... ఎలా పిలిచినా చెల్లిపోతుంది. మా పెద్దవారికి బుద్ధిలేక అలివేలు మంగతాయారు అని అమ్మవారి పేరు పెట్టారంటారా? ఇదిగో చూడండీ.... ఈ రోజు లగాయతూ మర్యాదగా పిలువకపోతే మర్యాదగా వుండదు. మర్యాదేకాదు మరోసారి కాఫీ కూడా ఉండదు. మరోసారుండదంటే మొదటిసారికి వుంటుందని మురిసిపోకండి. ఇంతకు ముందు తాగిన కాఫీయే ఆఖరుది. అసలు ఒక్కసారన్నా మా అమ్మా నాన్న పెట్టిన పేరు అలివేలు మంగతాయారు అని పూర్తిగా, కమ్మగా నోరారా పిలిచారటండీ?"

"అది కాదు... ఎంతెంతలేసి అబద్ధాలాడుతున్నావే? అంతంత పెద్ద పెద్ద అబద్ధాలాడకు. వచ్చే జన్మలో కూడా ఆడపిల్లగానే పుడతావు. మన పెళ్లయిన రోజు గృహ ప్రవేశానికి అమ్మలక్కలందరూ పేర్లు చెబితేగానీ వల్లకాదని పట్టుబడితే అప్పుడు పూర్తి పేరు చెప్పాను కాదేమిటీ?"

"పెళ్లయిన తరువాత గృహ ప్రవేశానికా? అయ్యో సంబడం... ఆరోజునయినా మీరు సవ్యంగా పేరు చెబితే నేనెందుకు మీ మోచేతి మీద చిన్నగా గిచ్చవలసి వచ్చిందో చెప్పండి."

"అదేనేమిటే చిన్నగా గిచ్చడమంటే? పెద్దగా గిల్లటం కూడా కాదు. అయ్యబాబోయ్! బాగా అరచేతి మందమున్న నల్ల మండ్రగబ్బ పీకడంతో సమానం. ఆ నొప్పి ఇప్పటికి కూడా తగ్గలేదు తెలుసా? మూడురోజులనాడు కూడా కాస్త కొబ్బరినూనె రాసుకున్నా"

"అబ్బో...బడాయి. నీకేమీ తెలిసి చావదు అని నన్ను మొట్టికాయలేయలేదా? నా చెవులు మెలిపెట్టలేదా? మొన్నమొన్నటిదాకా కూడా నా జడ పట్టుకుని గుంజడం ఆపారా?"

"అది కాదు తాయారూ...కావాలంటే ఎవరూ లేనప్పుడు నువ్వు కూడా నా జుట్టు పట్టుకుని గుంజు. అంతేగానీ కాఫీకి దానికి లింకుపెడితే..."

"జుట్టు పట్టుకుని గుంజడమా? బావుందండీ..బావుంది. ఇటీవలెప్పుడైనా మీకసలేమన్నా జుట్టుందేమో అద్దంలో చూసుకున్నారా? బట్టతలకి పైదాకా సబ్బు రుద్దవలసి రావడంతో

సబ్బుల పద్దు పెరిగిందనన్నా గ్రహించారా? అన్నట్లు మా పద్మేమందో తెలుసా? అలా కాదు...మొన్నసలేం జరిగిందో ఎరుగుదురా? అలా కాదు...అలాకాదు''

"మీ పద్మ ఏమందో నాకేం తెలుసే? ఎరుగుదురా అంటే చెప్పి చావందే ఎలా ఎరుకవుతుంది?''

"ఉడుక్కోకండి మరి మొన్నామధ్య మనిద్దరమూ చీరల కోసమని బజారుకెళ్లామా?''

"నీకు చీరల కోసమని బజారుకు తగలడ్డాం. మన ఇద్దరికీ చీరల కోసమని కాదు.''


"అదే అప్పుడే మా పద్మ మనిద్దరిని చూసిందిట. అది అమెరికా వెళ్లి దాదాపు పదేళ్ల తరువాత వచ్చింది. నన్నయితే తేలికగానే గుర్తుపట్టింది కానీ..మిమ్మల్నే?''

"బాగానే వుంది. ఆ ఇకిలింపాపి ఏం జరిగిందో అఘోరించు''


"మా పుట్టింటికి ఫోను చేసి మన ఫోను నెంబరు సంపాదించిందిట. నాకు ఫోన్ చేసింది. 'ఏమే నువ్వు శ్రీనివాసరావుగారికి విడాకులిచ్చి ఈ బట్టతలయాన్నెవరినో చేసుకున్నట్టున్నావే? మన దేశం కూడా అమెరికాలాగా అయిపోయిందేమిటే?' అంటూ తెగ ఇదైపోయిందండీ. దానికి అసలు విషయం అర్థమయ్యేటట్లు చెప్పేటప్పటికి నా తలప్రాణం తోకకొచ్చిందంటే నమ్మండి''

"తలప్రాణం తోకకొచ్చిందని అంటూ దీర్ఘాలు తీస్తూ సన్నాయి నొక్కులు నొక్కనక్కర్లేదు. మరి నువ్వేమో మన పెళ్లికి ముహూర్తం పెట్టిన మరుసటిరోజు నుంచే ఈ సైజుకు పెరిగావు. ఇక ఆ బారెడున్నర జుట్టుకేమో వారానికి మూడువందల రూపాయల కుంకుడుకాయలు, సీకాయలు, షాంపులూనూ. వారానికి మూడువందల రూపాయల రంగూ, మూడొందల రూపాయల సుగంధపు నూనెలు రాస్తూ వుంటావు. ఇక గుర్తుపట్టడానికేమన్నా టెలిస్కోపులు కావాలా? లేకపోతే విదేశీ చదువులేమన్నా చదవాలా?''

"సంతోషించావులెండి . తెలివితేటలకు. ఏదో కొద్దిగా బొద్దుగా వున్నంత మాత్రాన మీరంతగా ఎగతాళి చేయనక్కర్లేదు. మా అలివేలు బాగా భారీ మనిషవుతుందమ్మా




అని మా బామ్మ చిన్నప్పుడు తెగ మురిసిపోయేది. అయినా నాజూకు కోసమని ఆ పిట్ట మెతుకులు తిని ఉపవాసాలుండి గుడ్లు వెళ్లుకొచ్చే వారిలాగా ఉండడం నావల్లకాదు బాబూ. ఇక వెంట్రుకలంటారా? దేవుడు అందరికన్నా మరో గుప్పెడు పొడుగిచ్చాడు. దానికి నన్నేం చేయమంటారు? అక్కడికీ మీ పోరు పడలేక రెండుసార్లులో ఏమో తిరుపతిలో స్వామివారికిచ్చాను కదా. అసలు పిలిచిన పని చెప్పండి. నాకు తీరికలేనంత పనుంది. కాఫీగానీ కావాలంటే మీ ముద్దుల కూతురు షటిల్ నుంచి వచ్చే టైమైంది.



## 5500 ఏళ్లనాటి షూ

ఆర్మేనియాలో ఒక పర్వత గుహలోకి వెళ్లిన పశువుల కాపరికి అక్కడొక షూలాంటిది దొరికితే దాన్ని పురావస్తు శాస్త్రజ్ఞులకి చూపించాడట. వారి పరిశోధనలో వాస్తవంగానే అది సింగిల్ లెదర్‌తో చేసిన 5500 ఏళ్ళనాటి కుడి కాలి షూ అని వారు నిర్ధారించారు. అది 7వ నెంబర్ షూ అని, అప్పటి స్త్రీ ధరించి వుండవచ్చని వారి భావన. తర్వాత వారు ఆ గుహని పరిశీలిస్తే అక్కడ కొన్ని వేల ఏళ్ళనాడు మనుషులు నివసించిన ఆనవాళ్లు లభ్యమైనాయిట.

-తటవర్తి



అది రాగానే దానితో కలిపించుకోండి''

"అదికాదోయ్. నీకేమన్నా నా సహాయం కావలసుంటుందేమో చేద్దామనే సదుద్దేశంతో పిలుస్తుంటే గునుస్తావేమిటోయ్ మరీ విడ్డూరంగా? సరే మరి నా సహాయం ఏమీ అఖ్కరలేదన్న మాటేగా?''

"అక్కర్లేదు మహాప్రభో అక్కర్లేదు మీ సహాయాలు, మీ కూతురి సహాయాలూనూ. ఎలాగోలాగా నా మానాన నన్నేడవనివ్వండి. తయారూ...తయారూ అని ఘడియకొకసారి పిల్చి మల్లాదివారి కృష్ణాతీరం పుస్తకమెక్కడ పెట్టానంటావు? ఈ పూల మొక్కకు నీళ్లు పోసావు కాదేమి... అదిగో ఆ కాకిని కొట్టు, ఆ రేడియో సౌండేమిటి మైకులాగా? అనకుండా ఉంటే అదే పాతికవేలు, మీరు సాయపడినంత ఫలం.''

"ఈ పాతికవేలేమిటే మధ్యలో? అదే పదివేలన్న మాటయితే విన్నానుగానీ పాతికవేలన్న మాటే వినలేదు. ఎక్కడన్నా సామెతలు చెప్పవలసి వస్తే నేర్చుకోవడానికి వుంటుందని సామెతల పుస్తకం కొని మరీ చదివాను. దానిలో కూడా ఈ పాతికవేలన్న మాట నాకు తగలనేలేదు. మీ పుట్టింటివారికీ నీకూ లెక్కలొచ్చి చావవంటేనేమో మళ్లీ ఇంతెత్తున కోపం. లెక్కల గురించి చెప్పవలసి వస్తేనేమో మరి అన్నీ బూతులేనాయే?''

"అయ్యా... ఆ రోజుల్లో పదివేలు పెడితే వచ్చే బంగారం ఇవ్వాళ కొనాలంటే పాతికవేలు పెట్టినా రావడంలేదు. అదిగో ఆ లెక్కలమ్మట అలా అన్నాను తప్పించి మీలాగా ఒక పది పదీ రెండుపదులిర్వై మూడు పదులు అంటూ ఎక్కాలు వల్లెవేసే లెక్కలు నేను చేయడంలేదు.''

"అది కాదు మంగా... ఇంతకూ నిన్నూ నేను ఎందుకు పిలిచానంటావూ... ఆ... నా సహాయమేమన్నా కావాలసి వస్తే అడుగు చేస్తాను మొహమాటం పడకూ అని చెప్పడానికి.''

"ఓరి భగవంతుడా! వద్దంటున్నాను కదండీ. మీరలా ఆగండి. ఊ...నేను వెడుతున్నా. నాకవతల ఒక్క పని తెమిలి చావలేదు. పైగా నిన్నా ఇవాళ పనిమనిషి కూడా వస్తోంది. గడిచిన వారమంతా అది రాకపోతే ప్రాణానికి హాయిగా ఉంది. చక్కగా తెల్లవారగట్టే లేచాను. పనులన్నీ చకచకా, స్థిమితంగానో ఎలాగోలా నా ఇష్టమొచ్చినట్లు నేను చేసుకున్నాను.''

"అది కాదు తాయారూ! అందరూ పని మనుషులు దొరకలేదనీ, చెప్పకుండా నాగాలు పెడుతున్నారని ఊరికే బాధపడుతుంటారు. నువ్వేమిటో ఇటీవల ఎప్పుడు చూసినా పనిమనిషి వస్తేనే చిరాకన్నట్లుగా మాట్లాడుతున్నావు. మరీ చోద్యం. పోనీ పనిమనిషిని వద్దనరాదూ? ఊహూ... మళ్లా అలా పనికిరాదు. పనిమనిషి రావలసిందే. ఆ అమ్మాయి జీతం ఆ అమ్మాయికి ఇవ్వవలసిందే. ఎందుకొచ్చిన హైరానా చెప్పు?''

"అయ్యా శ్రీనివాసరావుగారూ! మీకెందుకా వివరాలన్నీ. పనిమనిషి ఇదిగో ఫలానా ఇన్నింటికొచ్చి ఇన్నింటివరకూ మీ పని చూస్తానంటుంది. వేళకొస్తుంది కదా అని మనం ఒంటిమీద బట్టలు తప్ప మిగిలినవన్నీ సర్ఫేసి మరీ నానపెడదాం. ఆ రోజునే దాని మొగుడు దాన్నో, ఇదే దాని మొగుడ్నో కొడతారు. ఇంకా చూసి ఇంకా చూసి ఇక తప్పక మనమే ఆ బట్టలుతకడానికి మొదలుపెట్టేటప్పటికి సాయంకాలమవుతుంది. ఇక్కడ మనమే అంటే మీరూ నేనూ అని కాదు. ఈ మనమేలో తమరుండరు. ఉండేది నేనొక్కదాన్నేనన్నమాట. అప్పటికా బట్టలు కాస్తా కావి రంగెక్కుతాయి. అవి కాస్తా ఏ సన్యాసం తీసుకున్నవారికో ఇచ్చి మనం బ్యాంకు లోను తీసుకుని మళ్లీ కొత్తవి కొనుక్కోవడమే. అదే అలవాటు చొప్పున ఈ అమ్మాయి ఇప్పుడిప్పుడే వచ్చి చచ్చిందంటలే అన్న భరోసాతో ఏ ఆదివారం నాడో మనం ప్రతి పనీ బద్ధకంగా చేద్దామనుకుంటాం. ఇక ఆ రోజునే వాళ్లాయనకు దీన్ని తీసుకుని మార్నింగు షోకు వెళ్లబుద్దేస్తుంది. ఇంక

చెప్పడానికేముంది? మామూలప్పుడైతే అంట్లగిన్నెలన్నింటి మీదా నీళ్లు జల్లి ఎంగిళ్లన్నీ మీగడలాగా మెత్తబడేట్లు చేసి వుంచుతాం. అప్పుడది నాజూకుగా ఇలా ఇలా అంటూ మనతో కబుర్లు మొదలెడుతుంది. 'అబ్బ నీ తియ్యనీ దెబ్బ' సినిమా చూసారా అంటుంది. ఆ పేరుతో సినిమా వచ్చింది తెలీని మనం అది సినిమా ఏమిటే పాట కదా అంటాం తెలివిత క్కువగా. ఇక ఇప్పుడు పరిస్థితి అలాక్కాదు. అన్ని గిన్నెలూ బయట పడే యడానిక్కూడా వ్యవధి ఉండదు. ఓ నా పతి దేవాదిదేవుడా! ఈ యుదాహ రణంబులు చాలునా? లేని యెడల మరొక్క రెండు చెప్పమనెదరా? ఆ యొక్క నిర్ణయమేదైననూ కడపటికి మీమీదే ఆధారపడి ఉన్నదని తెలిసెద రుగా. ఏమండీ ఇక్కడ ఒక్కసారి నవ్వితే బాగుంటుందేమో కదూ?"

"నీ బొందలాగుంటుంది. అది కాదు...అలివేలు మంగతాయారూ! ఇదిగో ఇక్కడ పూర్తి పేరుతో పిలిచాను. విని గుర్తు పెట్టుకో. మళ్లా ఈ తఫా నన్నలా పిలిచేరుకారూ...ఇలా పిలిచేరుకారూ అనేప్పుడు పనికొస్తుంది. ఆ... ఎక్కడున్నానూ...నువ్వెన్ని చెప్పినాసరే ఆ పనమ్మాయి రాగానే ఏదో సవతి వచ్చినట్లుగా నువ్వలా చిర్రుబుర్రులాడ్డం నాకేం నచ్చలేదు."

"మీకు నచ్చినా నచ్చకపోయినా సరే అదంతే. ఇంక ఈ పూటకు కనుక మీరు నన్నొదలకపోతే మీరు నాకు సవతిని తీసుకు రావడమేమోగానీ నేను మాత్రం మీకొక సవతిని తీసుకురావాలన్నంత కోపమొస్తుంది."

"రామ...రామా...! నీకు సవతిని తీసుకువస్తానని నేనెక్కడన్నానే? శ్రీరామా అంటే బూతయిపోతే ఎలా చస్తామే బాబూ!"

★★★

"నాన్నగారూ! నాన్నగారూ! ఏం పుస్తకం మీరు చదివేది?"

"శ్రీపాదవారి వడ్లగింజలమ్మా. ఎంతసేపయింది నువ్వు వచ్చి? ఇవ్వాళె వరు గెలిచారమ్మా షటిల్‌లో"

"నేనే గెలిచా. లోగడ చదివినదే గదండి ఎన్నిసార్లు చదువుతారు?"

"ఎన్నిసార్లు చదివితే మాత్రమేమమ్మా. చేసుకున్న పండుగలే మళ్లీ మళ్లీ చేసుకోవడంలేదా? ఆరోగ్యంకోసం రోజూ నువ్వు ఆడిన షటిల్ మళ్లీ ఆడడంలేదా? విశ్వనాథవారన్నట్లు తిన్న అన్నమే పూటా పూటా తినడం లేదా? అలాగే మానసిక ఆనందారోగ్యాల కోసం నేనూ మరలా మరలా చదివినదే చదువుతుంటాను."

"ఇదిగో..మిమ్మల్నే. ఎవరితోనో మాట్లాడుతున్నారే? మీ ముద్దుల కూతురు వచ్చిందా? వస్తే దాన్నిలా లోపలకొకసారి రమ్మని చెప్పండి. ఒక పనీలేదు పాడూలేదు. నిద్ర మంచంమీంచి లేవంగానే ఆ బ్యాటొకటి పుచ్చు కుని తగుదునమ్మా అంటూ ఆ షటిల్ కోర్టుకు తయారు. ఇక అక్కడ్నించి రాగానే ఆఫీసాఫీసంటూ పరుగులూ, గంతులూ, దూకుళ్లూను. ఆ తినే రెండిడ్లీలయినా స్థిమితంగా తినడమా పాడా? ఒక పండుగా లేదు పబ్బ మూలేదు. ఎప్పుడన్నా అమావాస్యకో పౌర్ణానికో ఇంటి దగ్గరుంటే ఆ కాసేపూ కంప్యూటర్‌తోనూ, సెల్లుతోనూ సరిపోతుంది. ఒక నోము నోద్దా మనో, ఒక వంటో వ్రతమో నేరుద్దామనో ఏమీలేదు. రేపు పెళ్లయి అత్తవా రింటికి వెళ్లినాక ఆడపిల్లలన్నాక అత్తెసరు పెట్టడం కూడా రాకపోతే ఎలా గమ్మా? కనీ పెంచినమ్మకు తెలియొద్దూ. ఇవతల పుల్లతీసి అవతల పెట్టడం కూడా నేర్పుకోరా? అని నన్ననబోతారు."

"నాన్నా! ఏమిటి అమ్మ గొంతులో కోపం కత్తులు రాపాడినట్లుగా రవర వమంటోంది. ఇప్పుడు లోపలికెళితే నామీద విరుచుకుపడుతుందేమోరా"


"అవునమ్మా. పొద్దుటినుంచీ వాతావరణం కత్తుల రవరవలగానే ఉంది. కొంచెం ఇంచుమించుగా కాంతారావు కత్తి యుద్ధం చేసిన జానపద సిని మాయే అనుకో"

"మరీ...నాన్నగారూ! మీకొక విషయం చెప్పాలి. అమ్మ ఇటీవలి కొద్ది మాసాలుగా అయినదానికీ, కానిదానికీ కూడా నామీద నామీదనేముంది లెండి పనిమనిషి మీదా, మీమీద కూడా పెద్ద స్థాయిలో విరుచుకుపడు తోంది. ఒక్కోసారి కూడని మాటలు కూడా అంటోంది. ఆ తరువాత తానన్న మాటలకు తానే బాధపడుతోందనుకుంటా. అక్కరలేనంత బుజ్జగి స్తోంది. మానసికంగా ఏదో డిస్టర్బెన్సున్నట్లుంది. ఈ విషయం మీకు తెలి యదని కాదు, ఒకసారి కౌన్సిలింగ్ చేయించితే బావుంటుంది. మాట్లాడితే




## 'ఇప్పట్లో పెళ్లి చేసుకోను!'

ఈ మాట అంటున్నది మరెవ్వరో కాదు... 'ఏక్ నిరంజన్'తో టాలీవుడ్‌కి పరిచయమైన బాలీవుడ్ నటి కంగనా రనౌత్. 'నాకు ఇప్పట్లో పెళ్లి చేసుకునే ఉద్దేశ్యంలేదు. ముందు నటిగా అందరి అభిమానాన్ని చూరగొనాలన్నదే నా ఆశ. ప్రస్తుతం నా ఆలోచన అంతా నా కెరీర్ గురించే. పెళ్లి కెరీర్‌కు అడ్డంకి అని నాకు తెలుసు. అందుకే నా సినిమా కెరీర్‌ను చక్కగా ప్లాన్ చేసుకునే ఆలోచనలో వున్నాను' అంటోంది కంగనా.



పెళ్లి పెళ్లంటుంది. ప్రతి మూడో వాక్యమూ నా పెళ్లి గురించే.

నేనింకో ముఖ్య విషయం గురించి కూడా మీతో చెప్పాలి. ఈ విషయాన్ని నేను లోగడే మీకు చెప్పి వుండవలసింది. భయం చేత కొంతా, సమయమొచ్చినప్పుడు చెప్పొచ్చులే అని కొంతా జాప్యం చేసాను. సోమూ అని నాకు సీనియరు. మీరూ, అమ్మా ఇష్టపడితే అతనికి నా జీవితాన్ని పంచాలనుకుంటున్నాను. వాళ్ల అమ్మానాన్నలకు పెద్దగా అభ్యంతరాలు ఉండవన్నట్లుగానే సోము నాకు చెప్పాడు. సోము చెల్లికి పెళ్లయినాక మేము పెళ్లి చేసుకుందామనుకుంటున్నాము. అది కూడా మీకూ అమ్మకూ అంగీకారమైతేనే. అమ్మకు చెప్పి ఒప్పించే బాధ్యత మీదే నాన్నగారూ! నేను నా జీవితంలో స్వతంత్రించి తీసుకున్న అతి పెద్ద నిర్ణయమిది. ఈ విషయం ఇంతదూరమొచ్చేదాకా దాచి పెట్టినందుకు నన్ను క్షమించండి.''



## జెనీలియా నమ్మకం!

తెలుగువారి అభిమానాన్ని చూరగొన్న జెనీలియా మలయాళంలో హీరోయిన్‌గా ఒక చిత్రంలో నటిస్తోంది. ఆ చిత్ర విశేషాలను చెబుతూ "నేనింతవరకూ ధరించని పాత్రను మలయాళం చిత్రంలో పోషిస్తున్నాను. ఈ పాత్రను ధరించే ముందు అసలు ఈ పాత్రకు నేను న్యాయం చేయగలనా? అనిపించింది. కానీ దర్శకుడు, యూనిట్ సభ్యులు అంతా నాకెంతో ధైర్యం చెప్పి ప్రోత్సహించారు. వారిచ్చిన ప్రోత్సాహంతో ఆ చిత్రంలో ఎంతో ఉత్సాహంగా నటించాను. ఈ చిత్రం తప్పకుండా పేరు తీసుకొస్తుందన్న నమ్మకం నాకుంది'' అంటోంది జెమీలియా.




"సోము పూర్తి పేరు సోమశేఖరం. వాళ్ల నాన్నగారి పేరు సదాశివరావు. ఆయన రైల్వేలో టీసీగా పని చేస్తున్నారు. అమ్మ పేరు ఆదిలక్ష్మి. ఈవిడ గృహిణి. వీరికి సోము, సుమ ఇద్దరే సంతానం. కులగోత్రాల విషయాల కొస్తే శాఖలతోసహా అన్నీ సవ్యంగానే ఉన్నాయి. ఇక ఆస్తిపాస్తులయితే...''

"నాన్నగారూ! ఈ...ఈ విషయాలన్నీ మీకు... ఎలా... వాట్టెమీన్...''

"పిచ్చిపిల్లా! నేను ఆడపిల్లను కన్నవాడిని. అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి. నీ విషయంలో మాకు స్మెల్ రాగానే సంవత్సరం క్రితమే ఇదంతా భోగట్టా చేయించాం. మీ మేనమామ సారధికి అందునా పోలీసు డియస్పీగా పని చేస్తున్నవాడికి ఈ విషయాలన్నీ తెలుసుకోవడానికి రెండు వారాలకు మించి సమయం అక్కరలేకుండా పోయింది.''

'మాకూ అంటున్నారు... అమ్మక్కూడా ఈ విషయాలన్నీ తెలుసా?''

"నువ్వూ సోమూ పరస్పరం ప్రేమించుకుంటున్నారన్న విషయం తప్ప మిగిలినవాటిలో చాలావరకూ తెలుసు. సోముకు నిన్నిస్తామని మేమే ప్రతిపాదన చేద్దామని, అప్పుడది ఆటోమేటిగ్గా పెద్దలు కుదిర్చిన సంబంధం అవుతుందని నేనూ మీ సారధి మామయ్యా అనుకున్నాం. మొత్తం విషయం తెలిసినవాళ్లం మేమిద్దరమే''

"మరలాంటప్పుడు ఈ సంగతులన్నీ ఎందుకు దాచారు?''

"చూడమ్మా! పెళ్లంటే అనేక ప్రత్యక్ష పరోక్షాంశాల సమాహారం. యువతీ యువకులు ఒకరినొకరు ఇష్టపడడమో, పెద్దవారు పరస్పరం ఒడంబడికలకు రావడమో లాంటివి వాటిలో కొన్ని మాత్రమే. ఇంకా కనబడనివి అనేక అంశాలుంటాయి. ఉదాహరణకి సోమూ కుటుంబంలో సోమూకే తెలియని నీకు చెప్పనివి చిన్న చిన్న చిక్కులున్నాయి. సోమూ వాళ్ల మేనత్త తన కూతుర్ని సోమూకిచ్చి చేయకపోతే రైలుకింద పడతానని బెదిరించింది. సదాశివరావు మెత్తబడ్డాడు. ఆదిలక్ష్మికేమో సోమూ వాళ్ల మేనత్తతోతప్ప ఈ ప్రపంచంలో మరెవరితో వియ్యమైనా ఫర్వాలేదు. ఐతే కట్నం మాత్రం కావాలి. సోమూ మేనత్త కూతురికేమో తాను టీవీలో నటించడానికి తప్ప పెళ్లికోసం పుట్టలేదని ఓ గొప్ప నమ్మకం. ఈ సంగతులు మేము చెప్పేకన్నా వాటంతటవే మీ ఇద్దరకూ తెలిస్తే మంచిదనీ, నీ ప్రేమను మాకు వెల్లడించే ధైర్యం నీకొచ్చేదాకా ఓపిక పడతామనీ, అలాంటి శక్తి నీకొచ్చి విజయసాధనలోగల ఆనందాన్ని నువ్వనుభవించాలనీ భావించాం. అలాకాక పెద్దలం మేము ప్రవేశించాక తీరా ఆ ఫలితం నీకనుకూలంగా రాకపోతే మాకిష్టంలేక మేమే చెడగొట్టామని అపార్థం చేసుకుని నువ్వేమైపోతావోనని భయపడి ఈ సంగతులు నీదాకా రానివ్వలేదు.''

"నేను శ్రీనివాసరావు, అలివేలు మంగతాయారు కూతురునండీ''

"మంచిదమ్మా. ఈ విషయాలన్నిటి బాధ్యతా నాకొదిలిపెట్టు. మీ అమ్మ ప్రవర్తన దగ్గరకొస్తే కారణం నాకు తెలిసిందిలే. కొంపలు మునిగిపోయేదేమీకాదు. కొద్దిమాసాలాగితే అంతా సర్దుకుంటుంది. అందాకా మీ అమ్మ ఏమన్నా పట్టించుకోకుండా చిరుహాస్య ధోరణిలో మాట్లాడుతూ మీ అమ్మను ఆనందంగా ఉంచడానికి ప్రయత్నం చేయి. కౌన్సిలింగు అవసరం ఉండదు. అంతగా అయితే అవసరాన్నిబట్టి అప్పుడు చూద్దాం. ఇక నీ పెళ్లి విషయమంటావా? నువ్వు వెంటనే పెళ్లి చేసుకోవడం తనకి ముఖ్యంకానీ మిగిలిన విషయాలు పెద్దగా పట్టించుకుంటుందనుకోను. చూద్దాం మీ అమ్మను ఒకసారి పిలువు''

"ఓహో...అమ్మకంతా తెలుసా? అలాగైతే అమ్మను కొంచెం ఆట పట్టిస్తాను చూడండి"

"వద్దులేమ్మా. పాపం రెండు మూడేళ్లుగా మీ అమ్మకు నీ పెళ్లి తప్ప మరో ఆలోచనలేదు. ఆ ఆరాటంలో పడి ఒక్కోసారి మానసిక వత్తిడికి గురవుతోంది"

"ప్లీజ్ నాన్నగారూ... ఒక్క అయిదు నిముషాలు ప్లీజ్"

"వద్దులేమ్మా... నా మాట విను"

"అమ్మా...అమ్మా"

"మళ్లా పనిలో పడి వుంటుంది. నువ్విప్పుడు వంటింట్లోకెళితే మాత్రం నీకు అక్షంతలు తప్పవుగానీ నీకు తోడుగా నేను కూడా వస్తానులే పద"

"ఆ...ఏమిటోయ్! ఎంతవరకూ వచ్చింది నీ వంట?"

"మీరు తెచ్చిన పుచ్చు వంకాయలు పారేసి ముద్దపప్పు వండేదాకా! ఏమే అయ్యాయా నీ పెత్తనాలు. లేడికి లేచిందే పరుగుని అస్తమానం ఆ షటిలూ, జాగింగులేనా కాస్తేమన్నా వంటా వార్పూ నేర్చుకుందామని వుందా? రేపు ఆ వచ్చిన వాడికేమన్నా వండి వడ్డించాలా అక్కర్లేదా?పేరు మాత్రం మీ నాన్నగారు ఏరికోరి పెట్టారు వినమ్ర. నేతి బీరలో నెయ్యిలాగా ఒక్క పేరులోనే వినమ్రత. మామూలుగా ఒక వినయం లేదు, వందనం లేదు. రేపు అందరూ నన్నేనంటారో, కన్నతల్లికి ఏమీ చాతయ్యి చావదు కాబోలు, లేకపోతే ఎందుకు నేర్పించింది కాదూ? అని"

"..."

"చూసారా...నేనెన్ని వాగినా అది మాత్రం బెల్లం కొట్టిన రాయిలా ఒక్క మాట మాట్లాడిందేమో? నాకు తెలుసు అంతా మీ తర్ఫీదే. ముప్పయ్యేళ్లొచ్చినాయి నెత్తిమీదకి. ఒక పెళ్లనదు పేరంటమనదు. నన్ననీయదు. సరే నా తల రాత ఇలా వుంది, ఖర్మిలా కాలింది. నేనింతకన్నా ఏం చేయగలను? టిఫిను పెడతాను, కాళ్లూ చేతులు కడుక్కో, మీరు కూడా రండి"

"అమ్మా! ఇప్పుడు నువ్వెలా ఉన్నావో తెలుసా? డాక్టర్ చక్రవర్తి సినిమాలో సావిత్రిలాగా ఉన్నావే. ఫ్చ...ఫ్చ...మా మంచి అమ్మ. ఇవ్వాళ పప్పుచారు కాయవే ఏకంగా అన్నమే తినేస్తాను. అంతగా అయితే ఈ టిఫిన్ మధ్యాహ్నం తింటాను. అన్నట్లు ముప్పయ్యేళ్లెవరికమ్మా?"

"నీ పుట్టినరోజు నాలుగు సంవత్సరాలకు ఒకసారి కదమ్మా వచ్చేది. అసలు పుట్టినరోజులారుకదా. ఆరు నాలుగు ఇరవై నాలుగనబోయి ఆరయిదులు ముప్పయ్యంటోంది. పుట్టింటివారి లెక్కల తెలివితేటలులే. అవునా తాయారూ?"

"ఆహా...సంతోషించాముగానీ... ఆగండలా. లెక్క అనవలసిన ప్రతి చోటా లెఖ్ఖ అనే మీరు నాకు చెప్పొచ్చేరా. నువ్వురా తల్లీ. వయసుని అలా ఎక్కువెక్కువ చెబితే అమ్మో నాకన్నేళ్లొచ్చాయా అని తొందరగా ఒప్పుకుంటావని నా ఆశ."

"నమ్రా! పప్పుచారు చేసి దానిలోకుంటాయి నాలుగు వడియాలూ, నాలుగు ఉప్పు మిరపకాయలు వేయించి పెడతాను. నువ్వాఫీసుకి ఒక అరగంట ఆలస్యంగా వెళ్లినా ఫర్వాలేదా. ఆగుతావా మరి? అవునే ఇవ్వాళ ఆఫీసుకి సెలవు పెడతానన్నావుగా?"

"..."

"అమ్మాయేదండీ? స్నానానికిగానీ వెళ్లిందా?"

"అవునే వెళ్లింది. ఇదిగో మంగా! ఈడొచ్చిన పిల్లకి పెళ్లి చేయాలని నీకున్న ఆరాటాన్ని నేనర్థం చేసుకోగలను. నువ్వింక ఆ ఆరాటాన్ని తగ్గించుకోవచ్చు. అదెవరినో ఇష్టపడుతున్న సంగతి ఎట్టకేలకు నా దగ్గర బైటపడింది. నువ్వు మరేమీ బెంబేలుపడకు. ఆ కుర్రాడు మరెవరో కాదు, మీ తమ్ముడు చెప్పాడే రైల్వే టీసీ సదాశివరావుగారబ్బాయి గురించి... అదిగో అతనే ఇతను. మన సారధి వాళ్ల గురించి అంతా తెలుసుకున్నాడులే. అంతా మనకనుకూలమైన సంబంధం. అమ్మాయి కోరికా మన కోరికా అదే అయినప్పుడు మనకంతకన్నా కావలసిందేముంది?"


"అమ్మయ్య... అంతా ఆ దేవుని దయ. నా పూజలు వూరికే పోతాయటండీ. స్వయంగా మా తమ్ముడే ఈ పనికి పూనుకున్నప్పుడే నాకు తెలుసు. అంతా శుభంగా జరుగుతుందని. ఇప్పుడింక నాకే దిగులూలేదు"



## డేన్సింగ్ మెర్‌మెయిడ్స్


మెర్ మెయిడ్స్ అంటే పై శరీరం స్త్రీ ఆకారం కలిగి, క్రింది శరీరం చేప తోకలా వుండేదని మనకి తెలుసు. ఇటీవల బీజింగ్ ఎక్వేరియంలో కొందరు ఏక్వా డేన్సర్లు మెర్‌మెయిడ్స్‌లా డ్రెస్ చేసుకుని తమ నృత్య విన్యాసాలతో సందర్శకులని అలరించారు. అబ్బురపరిచే వీరి నృత్యాన్ని చూసిన సందర్శకులు ఎంతగానో ఉప్పొంగిపోయారంట.

-తటవర్తి



"ఇదుగోనేవ్... అమ్మాయి ఇప్పుడొచ్చి తానెవరినో మన కులంకాని వాడ్ని ప్రేమించినట్లు, అతన్నితప్ప మరెవరినీ పెళ్లి చేసుకోనట్టూ నిన్ను ఉడికించడానికి నాటకమాడుతుంది, హడావుడి చేస్తుంది. ఇలా చేస్తానని అది చెప్పలేదనుకో. జరిగేదదే. నువ్వేమీ గాబరా పడకు, ఆవేశాన్ని నటించితే నటించుగానీ నిజంగా ఆవేశపడకు."


"ఓహో... ఇదీ మీరు నేర్పిందేనా? దానికి పుట్టిందా? సరే చూస్తా నేనం తకంటే నాటకమాడ్తా?"



## ఇండియన్ స్పైడర్‌మాన్

స్పైడర్‌మాన్ సినిమాలో హీరోలా నిజ జీవితంలో అలాంటి సాహసాలు చేసే చిత్రదుర్గకి చెందిన 22 ఏళ్ల జ్యోతిరాజ్‌ని ఇండియన్ స్పైడర్ మాన్ అనవచ్చు. తాళ్లు, నెట్లు లాంటి ఎలాంటి సదుపాయాలు లేకుండా కేవలం తన మునివేళ్లతో ఎలాంటి ఏటవాలు కొండనయినా, భవంతినయినా వంద అడుగులదాకా చకచకా పాకి పోగలడు. ఒక్కోసారి స్లిప్ అయినా తలక్రిందులుగా జంప్ చేసి సురక్షితంగా క్రిందకి దిగగలడు కూడా. అతను పునర్జన్మ ఎత్తిన వానరమని ఓ జ్యోతిష్కుడు అంటాడు. కానీ అతన్ని బాగా ఎగిరినవాళ్లు అతను మంచి సాధకుడంటారు. తమిళనాడుకు చెందిన జ్యోతిరాజ్ చిత్రదుర్గకు నాలుగేళ్లనాడు వచ్చి జీవితం మీద విసుగుచెంది గోడ ఎక్కి చనిపోదామని అనుకున్నాడట. అప్పుడేదో శక్తి ఆవహించినట్లు ఆగిపోయాడట. తరచూ తన కలలోకి వచ్చి సాహసాలు చేయమని ప్రోత్సహించేది అదే చోటని తోచిందిట. అంతే... అతను ఇక వెనుదిరగలేదు. అతన్ని ప్రభుత్వం కూడా ప్రోత్సహిస్తోంది. ఇటీవల అతను రాక్ క్లయిమింగ్ ఛాంపియన్‌షిప్‌ను కూడా గెలిచాడు.

-తటవర్తి




"అదిగో అమ్మాయొస్తోంది. నువ్వనే నాటకమేదో ఇక మొదలుపెట్టు."

"ఏమిటండీ రాద్ధాంతం చేసేది పెద్దవాళ్లం. మనం లేమా? అయ్యో ఎంత అప్రదిష్ట. నలుగురూ రకరకాలుగా అనుకోరా? అందుకే అది ఉద్యోగం చేసి సంపాదించకపోతే మనకు జరుగుబాటులేదా? వద్దన్నాను. అదిగో అది రానే వస్తోందిగా. దాన్నే అడుగుతాను. నాకేం భయమా? ఏమే! ఏమిటి మీ నాన్నగారు నువ్వెవరినో ప్రేమించావనీ, అదనీ ఇదనీ చెబుతున్నారు నిజమేనా? నీ మొగుడ్ని నువ్వే చూసుకునేటంత పెద్దదానివయ్యావన్నమాట. ఇంక పెద్దవారిగా మా పెద్దరికాలెందుకూ మంటకలవడానికి?"

"అవునమ్మా... నిజమే. మీకిష్టమున్నా లేకపోయినా నా నిర్ణయమదే"

"అది కాదు తాయారూ! ఎలాగోలా పెళ్లి చేసుకుంటానంటోందిగా. దాని సుఖసంతోషాలకన్నా మనకేం కావాలి చెప్పు. దానికి నచ్చేవాడ్ని చూసే బాధ్యత మనకు తప్పించిదనుకోరాదూ? ఒక ఏడాది ఓపికపట్టు నువ్వు అమ్మమ్మ అవుతావని సంతోషించరాదుటోయ్"

"అంతేనంటారా? సరేనే..అబ్బాయి మనవాడేనా?"

"ఆ..మనూరివాడే"

"చూసారా చూసారా దాని పొగరు?"

"మన వూరివాడు... అమ్మాయి చేసుకోగానే మనవాడే అవుతాడులే"

"మీరలా ఆగండి. అబ్బాయి పేరేమిటి?"

"ఆ... పేరులో ఏముందిలేమ్మా?"

"పేరులో ఏముండటమేమిటే? మీ నాన్నగారి పేరు శ్రీనివాసరావు కనుక నేను మా అమ్మ కడుపున ఇంకో నాలుగేళ్లకు పడతాననగా నా పేరు అలివేలు మంగతాయారు అని మా పెద్దలు నిర్ణయించారు తెలుసా?"

"మేమంతా సోమూ అంటామమ్మా. అసలు పేరు సోమశేఖరం"

"సోమునో వామునో.. పెళ్లన్నా మా ఇష్ట ప్రకారం చేయనిస్తారా?"

"నువ్వూ నాన్నా ఎలాచెబితే అలాగమ్మా?"

"అన్నట్లవునే వాళ్లు నీచు తినేవాళ్లా...అదేనే కోళ్లూ తినేవాళ్లేమోనని.."

"ఇదిగో...ఏమోయ్, ఒసే, ఏమే, ఏమిటే..అలివేలు మంగతాయారూ! వాళ్లు కోళ్లు, పాములు తింటే నీకేమి? నిన్ను తినమడంలేదుకదా?"

"అయ్యగారూ శ్రీనివాసరావు బావగారూ! నేను అమ్మాయితో మాట్లాడుతుంటే మధ్యలో మీ గోలేంటి? అయినా నా వెర్రిగానీ పాములూ, కోళ్లూ అని మాట్లాడేవారికిగానీ తినేవారికిగానీ 'పాంకోళ్లేసుకుని' పెళ్లిపీటల మీదకు రావడం చాతనవుతుందంటలే?"

"ఈ కాలంలో కూడా పాంకోళ్లేసుకుని పీటల మీదకు ఎవరొస్తారోయ్"

"నేను చెప్పేది కూడా ఈనాటి బొట్టికాయల గురించి కాదు, ఆనాటి మీలాటివారి గురించే"

"ఆహా...అలాగా. ఒక్కసారి ఆ పాంకోళ్లేసుకుని నడిస్తే తెలుస్తుంది. పట్టుచీర కట్టుకుని మేనత్త కొడుకు కూడా ఓ మొగుడేనా అని రీక్‌టాక్ మంటూ సిగ్గు లేకుండా రౌడీ నడక నడవడంకాదు"

"అబ్బో...ఎవరికన్నా తెలిస్తే నవ్విపోతారుగానీ నాకు సిగ్గులేకపోతే అదీ ఇదీ కలిపి మీకుందిగా. నాతోటి పెట్టుకోకండి. అమ్మాయుందని ఊరుకుంటున్నాను."

***

"ఇదిగో...ఏమోయ్ మంగా! ఒకసారి ఇటు చూడు. నిద్రపోయావా?"

"అబ్బా...ఏమిటండీ అర్ధరాత్రి అంకమ్మ సివాలన్నట్లు? ఇప్పటిదాకా చదువుతూనే వున్నారా? అయినా మీకేం? రేపు ప్రొద్దున ఎనిమిదింటిదాకా పడుకున్నా ఫర్వాలేదు. కాఫీ ఏమన్నా కావాలా?"

"అక్కర్లేదులే. లేచి కూర్చో..."

"అబ్బా...నేనిప్పుడు లేవలేను. విషయమేమిటో చెబుదురూ?"

"కాఫీ కావాలంటే లేచే దానివికదా. కావాలన్నాననుకుని లేవరాదూ?"

"కావాలనుకోలేదుగా. ఏమిటిదీ చిన్నపిల్లల్లాగా...బాబ్బాబు మీకు పుణ్యముంటుంది. నన్ను పడుకోనివ్వండి, నాకు నిద్రొస్తోంది."

"తాయారూ! నిద్రమత్తు పోయిందా? నీతో కొద్దిగా మాట్లాడాలి"

"నిద్రయితే పోయిందిగానీ మత్తు మాత్రం పోలేదండీ. ఏమిటో మాట్లాడేది? పగలు తీరలేదులాగుంది మాట్లాడడానికి"

"అదికాదే. నువ్విటీవల కోపాన్నదుపు చేసుకోలేకపోతున్నావు గ్రహించావా? పనిమనిషినైతే ఎలాబడితే అలా మాట్లాడుతున్నావు తెలుసా? అమ్మాయి వినమ్ర కూడా బాధపడుతోంది తెలుసా?"

"..."

"ఏడవకు. ఇందులో ఏడవాల్సిన పనేమీలేదు. అంతా నాకు తెలుసు."

"అది కాదండీ. ఊరికూరికే కోపము, దుఃఖమూ వచ్చేస్తున్నాయి. ఏమిటో అంతా అలా జరిగిపోతోంది. ఒక్కోసారి నామీద నాకే అదుపులేకుండా పోతోంది. గుక్క తిప్పుకునేటప్పటికి జరగవలసిన అనర్థం జరిగిపోతోంది. ఏ పనయినా ఏదో చేసుకుపోతున్నానుగానీ మునుపటి ఉత్సాహము, ఆసక్తీ ఉండడంలేదు. వంట్లో కూడా పెద్దగా బాగుండడంలేదు. వళ్లంతా, ముఖ్యంగా చెవుల వెనుక ఆవిరులొస్తున్నట్లు వుంటోంది. ఫ్యాను వేగమంతా పెట్టినా శరీరం వేడిగానే అనిపిస్తోంది. శరీరానికింకా గాలి కావాలనిపిస్తోంది. ముక్కుతో పీలుస్తున్న గాలి సరిపోక నోటితో కూడా పీలుస్తున్నానా అనిపిస్తోంది. అస్తమానం చన్నీళ్లతో స్నానం చేస్తే కొంచెం ఉపశాంతిగా అనిపిస్తోంది. వళ్లంతా పెద్ద బరువుగా వుండి చురుకుదనం మందగించింది. ప్రొద్దస్తమానూ పడుకున్నా బద్ధకం తీరడంలేదు."

"..."

"మీకు నవ్వులాటగానే వుంటుంది. పడేవారికి తెలుస్తుంది ఆ బాధ. తీరిక చేసుకుని ఒకసారి ఆ డాక్టరమ్మ దగ్గరకెళ్దామని రెండు మూడు నెలలుగా అనుకోవడమేగానీ పడి చావడంలేదు."

"ఛీ...ఛీ...ఊరికే నవ్వుతున్నాగానీ దానికి నువ్వేమీ నొచ్చుకోకు. ఇలా నా దగ్గరకు జరుగు. నీకు నెలసరులు క్రమం తప్పకుండా వస్తున్నాయా? నా అంచనా ప్రకారమైతే అవకతవకలుగా వుండుండాలి"

"అవునండీ. ఒక సంవత్సరం కాలంగా ఎగుడుదిగుడుగా ఉంటున్నాయి. ఏం అలా అడిగారు?"

"అదే మరి అసలు మ్యాజిక్, హార్మోన్‌లు చేసే మాయాజాలం. నీ లక్షణాలన్నీ చూసాక మెడికల్ వ్యాసాలు చదివాను. మా ఫ్రెండుకు ఫ్రెండ్ ఒక డాక్టరుంటే ఆయనతో ఫోనులో మాట్లాడాను. నా ఊహలు నిజమే. స్త్రీ జీవితంలో ఇదొక సంధి దశ. మెనోపాజ్ ఏజంటారట ఇంగ్లీషులో. పదం బానే వుంది కాబట్టి మనం కూడా దాన్నే వాడదాం. కొంతమంది స్త్రీలకేమీ ఉండదట. కానీ కొంతమందికి నువ్వు చెప్పే లక్షణాలన్నీ కొన్నిగానీ మరోరకానివిగానీ ఇబ్బంది పెడతాయిట. ఇది తాత్కాలికమే. చాలామందిలో కొద్ది మాసాలలో అంతా సర్దుకుంటుంది. నువ్వేమీ కంగారుపడకు. రేపు ప్రొద్దుట డాక్టరమ్మ దగ్గరకు తీసుకువెళతాను. పెందలాడే తయారవ్వు."

"ఆ...పోదురూ... ఇప్పుడెవరొస్తారు డాక్టరమ్మ దగ్గరకు. నాకిప్పుడు అంతా బాగానే వుంది."

"అదేనే మనసు చేసే మాయాజాలం. దాని మహిమ ఇంతింతని చెప్పలేము. ప్రొద్దున వినమ్ర పెళ్లికి ఒప్పుకోగానే నీలోనుంచి సగంపైగా నిరాశా, వత్తిడి పోయాయి. మిగిలినది నా సాహచర్యంతో ఈ పూటకు పోయింది. నిరంతరమూ మనసునూ, శరీరాన్నీ చురుగ్గానూ, ఆనందంగానూ ఉంచుకుంటే ఏ రోగాలూ, రొష్టులు రావని పెద్దలు ఊరికే చెప్పారంటావా? కోపాలూ తాపాలూ ఉండరాదని కాదుగానీ పథ్యంగా ఉండాలి. ఏ వయసులోనైనా కోపాలు, అలకలు, ఈ వయసులో శృంగారమూ మేరమీరకుండా పథ్యంగా ఉంటేనే రుచిస్తాయి. సరిగ్గా ఆ ప్రకారం నిర్వహించుకోగలుగుతున్నవారి దాంపత్యాన్ని మనం సంశయరహితంగా 'దాంపథ్యం' అనొచ్చు"

"సరే...సరే... ఇక పడుకుందురూ!"

★



## 'రజనీకే సాధ్యం!'

"ఈమధ్యనే నేను 'రోబో' చిత్రాన్ని థియేటర్‌లో చూసాను. అబ్బా... ఈ చిత్రం గురించి చెప్పాలంటే మాటలు చాలవేమో అనిపిస్తోంది. అంత అద్భుతంగా ఉందీ చిత్రం. నిజంగా రజనీకాంత్ యాక్షన్ సూపర్బ్. ఈ పాత్రను కేవలం రజనీ మాత్రమే చేయగలరు. ఐశ్వర్యారాయ్ అందం గురించి నేనిప్పుడు కొత్తగా చెప్పాల్సిన అవసరంలేదు. అంత అందంగా ఉందామె" అంటూ రోబో చిత్రంపై తన అభిప్రాయాన్ని వెల్లడించింది త్రిష.

